# స్థానిక సంస్థల ఎన్నికలకు, సన్నద్ధం కావాలి

## శ్రేణులకు పిలుపునిచ్చిన ఎమ్మెల్యే ముత్తుముల




**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 17**

స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అందరూ సమిష్టిగా సన్నద్ధం కావాలని తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి నియోజకవర్గ నాయకులకు పిలుపునిచ్చారు. గ్రామ స్థాయి నుండి బూత్ కమిటీల స్థాయి వరకు పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. మంగళ వారం రఘు కన్వెన్షన్ లోజరిగిన పార్టీ సమావేశంలో అశోక్ రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు ప్రభుత్వం అందిస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి వివరించి , అమలు చేస్తున్న విధానాన్ని ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని నాయకులకు సూచించారు. ప్రస్తుతం " రైతన్న – మీకోసం " అనే కార్యక్రమంలో భాగంగా ప్రతీ రైతు సంక్షేమం, పి.యం కిసాన్ నిధులు మంజూరు అయినది, లేనిది తెలుసుకొని ఏదైనా సాంకేతిక సమస్య ఉంటే వారికి తగిన సూచన చేసి అధికారుల దృష్టికి తీసుకోని వెళ్లాలని, త్వరితగతిన పూర్తి జరిగేలా చూడాలి అని నాయకులకు తెలిపారు తెలుగుదేశం పార్టీ విజయానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో కృషి చేయాలని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం మనందరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం ఏక కాలంలో అమలు చేస్తుందని, కాకుండా సూపర్ సిక్స్, మహిళా శక్తి, తల్లికివందనం ఉచిత గ్యాస్ సిలెండర్లు, రైతు భరోసా, అమరావతి రాజధాని నిర్మాణం, పోలవరం, వెలుగొండ ప్రాజక్టుల నిర్మాణం ఇలా ఎన్నో సంక్షేమ పథకాలు అమలుచేస్తోందని, వీటిని ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాల్సిన భాద్యత ప్రతి కార్యకర్త పై ఉందన్నారు. పదవులు వచ్చాయని మిన్నకుండారాదని ఉద్భోధించారు. ప్రతి గ్రామ స్థాయి నాయకుడు కార్యకర్త ప్రజలతో మమేకం కావాలని, వారిసమస్యల పరిష్కారంలో ముందుడాలని కోరారు. పార్టీ బలోపేతానికి మనం కృషి చేస్తే పార్టీ మన ఉన్నతికి తోడ్పాటు అందిస్తుందన్నారు. ప్రతి టిడిపి నాయకుడు , కార్యకర్త పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు.

పార్టీకి కార్యకర్తలే మూలస్తంభాలన్నారు. తెలుగుదేశం పార్టీ పేదోడి చెమటనుంచి ఉద్భవించిందని నాడు ఎన్టీఆర్ పార్టీని స్థాపించి పేద ప్రజానీకం కోసమెన్నోసంక్షేమ పథకాలు రూపొందించి అమలు చేశారని , పార్టీ పగ్గాలు చేపట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా ఆడిపందా తప్పకుండా పనిచేస్తున్నారని , నేడు టిడిపి ప్రజాహృదయాల్లో ఉందన్నారు. అందుకు మనం కృషి చేయాలన్నారు. ఎన్ని ఒడిదుడుకులున్నా పార్టీ ముందుకు సాగుతోందన్నారు. తెలుగుదేశం పార్టీ బలంగా ఉన్నప్పుడే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. ప్రతి కార్యకర్త , నాయకులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. గత ప్రభుత్వ స్కాములు, కిరాతక కీచకపాలనను, వైఫల్యాలను ప్రజల కు గుర్తు చేయాలని సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు మార్కెట్ యార్డ్ చైర్మన్ లు వైస్ చైర్మన్ లు, సొసైటీ బ్యాంక్ చైర్మన్ , వైస్ చైర్మన్ లు , మండల పార్టీ అధ్యక్షులు, సర్పంచ్ లు, పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ లు, వార్డు ఇంచార్జ్లు, తదితర నాయకులు పాల్గొన్నారు.

పెన్ పవర్
MARKAPURAM మార్కాపురం
మార్కాపురం - ప్రకాశం

## కలెక్టర్, జాయింట్ కలెక్టర్ లతో

# ఎమ్మెల్యే ఇంటూరి భేటీ




**కందుకూరు పెన్ పవర్ మార్చి 17:**

ప్రకాశం కలెక్టర్ పి.రాజాబాబు, జాయింట్ కలెక్టర్ కల్పన కుమారి తో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మంగళవారం సాయంత్రం భేటీ అయ్యారు. కందుకూరు నియోజకవర్గంలో రెవెన్యూ సిబ్బంది తగినంతమంది లేరని, విఆర్ఓ సహా పలు పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఎమ్మెల్యే వారి దృష్టికి తీసుకువెళ్లారు. ఆ కారణంగా రెవిన్యూ సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతోందని చెప్పారు. ముఖ్యంగా భూములకు సంబంధించి అనేక ఫైల్స్ పెండింగ్ లో ఉన్నాయని వివరించారు. వీలైనంత త్వరగా రెవిన్యూ శాఖలో ఖాళీలు భర్తీచేయాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు కోరారు. ఇంకా నియోజవర్గంలో పలు అభివృద్ధి పనుల గురించి వారితో చర్చించారు. కందుకూరు సబ్ కలెక్టర్ దామెర హిమవంశీ కూడా చర్చల్లో పాల్గొన్నారు.

# మెనూ సక్రమంగా పాటించాలి

### -మాచవరం హైస్కూల్ లో ఎమ్మెల్యే ఇంటూరి ఆకస్మిక తనిఖీ

### -వసతులు పరిశీలించిన నాగేశ్వరరావు




**కందుకూరు పెన్ పవర్, మార్చి 17**

మండలంలోని మాచవరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మంగళవారం మధ్యాహ్నం ఆకస్మి కంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వసతులు, సౌకర్యాలు నిశితంగా పరిశీలించారు. మినరల్ వాటర్ ప్లాంట్ సామర్థ్యం, మెనూ అమలు, బియ్యం ఇతర స్టాక్ వివరాలను గమనించారు. అలాగే విద్యార్థులతో మాట్లాడి, మధ్యాహ్న భోజనం సక్రమంగా పెడుతున్నారా లేదా, రుచి మరియు నాణ్యత ఎలా ఉంటుంది అని అడిగి తెలుసుకున్నారు. నేరుగా తరగతి గదుల్లోకి వెళ్లి 10వ తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడారు. పరీక్షలు బాగా రాస్తున్నారా అని అడుగుతూ వారికి ఆల్ ద బెస్ట్ చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే నాగేశ్వరావు ఇన్చార్జ్ హెచ్ఎం, ఉపాధ్యాయులతో మాట్లాడుతూ మెనూ సక్రమంగా అమలు చేయాలని సూచించారు. పరిసరాలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. అలాగే స్కూల్ భవనం స్లాబ్ అక్కడక్కడా దెబ్బతిని ఉండడాన్ని ఎమ్మెల్యే గమనించి, వెంటనే పరమతులు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట కందుకూరు మండల టిడిపి మాజీ అధ్యక్షులు నార్నే రోశయ్య, స్థానిక నాయకులు చిరంజీవి రెడ్డి ఉన్నారు.

# నేడు సాధారణ సర్వసభ్య సమావేశం

**గుడ్లూరు, పెన్ పవర్, మార్చి 17:**

మండలస్థాయి సాధారణ సర్వ సభ్య సమావేశము మండల ప్రజా పరిషత్ కార్యాలయం, గుడ్లూరు నందు నేడు అనగా (18వ తేది) బుధవారం ఉదయం 11.00 గంటలకు జరుగునని ఎంపీడీఓ వై.వెంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు. కావున ఈ సమావేశమునకు అందరు ఎంపీటీసీ సభ్యులు, కో-ఆప్షన్ సభ్యులు మరియు సర్పంచ్ లు తప్పక హాజరు కావాలని కోరారు. మండల స్థాయి అధికారులు అందరూ వారి శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారముతో ఈ సమావేశానికి హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

# వై సిపి సర్పంచుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

## గిద్దలూరు వైసిపి ఇన్ఛార్జ్ నాగార్జున రెడ్డి




**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 17**

గిద్దలూరు నియోజకవర్గంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్, మాజీ ఎమ్మెల్యే కుందూరు నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి ముఖ్య సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి నియోజకవర్గంలోని వైసీపీ సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పిటీసీలు పెద్ద ఎత్తున హాజరై ప్రస్తుత పరిస్థితులపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాగార్జున రెడ్డి మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో గ్రామాల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా సర్పంచులు శ్రద్ధతో అనేక అభివృద్ధి పనులు చేపట్టారని గుర్తుచేశారు. రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాలు, గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి వంటి పనులు ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పూర్తి చేశారని తెలిపారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత రెండేళ్లుగా ఆ పనులకు సంబంధించిన బిల్లులను నిలిపివేయడం వల్ల సర్పంచులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇది పూర్తిగా కక్షపూరిత రాజకీయ చర్యగా భావిస్తున్నామని, ముఖ్యంగా వైసీపీకి చెందిన ప్రజాప్రతినిధులను లక్ష్యంగా చేసుకుని ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. సర్పంచులు తమ సొంత నిధులు ఖర్చు చేసి పనులు పూర్తి చేసిన సందర్భాలు కూడా ఉన్నాయని, కానీ బిల్లులు రాకపోవడంతో అప్పుల భారం మోయాల్సి వస్తోందని తెలిపారు. ఇది గ్రామ స్థాయి పాలనపై ప్రతికూల ప్రభావం చూపుతోందని, భవిష్యత్తులో అభివృద్ధి పనులు కూడా నిలిచిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రాజ్యాంగబద్ధంగా సర్పంచులకు కల్పించిన అధికారాలను పక్కనబెట్టి, వారి ప్రమేయం లేకుండా నిర్ణయాలు తీసుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని నాగార్జున రెడ్డి అన్నారు. గ్రామ పంచాయతీల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ సమస్యపై జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి, పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేకపోతే సర్పంచులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అంతేకాకుండా, ఈ అంశంపై న్యాయపరమైన పోరాటానికి కూడా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. అవసరమైతే కోర్టులను ఆశ్రయించి సర్పంచులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో పలువురు సర్పంచులు మాట్లాడుతూ తమ సమస్యలను వివరించి, ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు. గ్రామ అభివృద్ధి కోసం చేసిన పనులకు న్యాయం చేయాలని, పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు.ఇదేసందర్భంగా పదవీకాలం ముగిసిన కౌన్సిలర్లను ఆయన ఘనంగా సత్కరించారు.

# 19 కిలోల గంజాయి పట్టివేత

## -ఒకరి అరెస్ట్ -డీఎస్పీ బాలసుబ్రమణ్యం



**కందుకూరు పెన్ పవర్ మార్చి 17**

గుడ్లూరు మండలంలో గంజాయి అక్రమ రవాణా కేసును పోలీసులు ఛేదించారు. మంగళవారం కందుకూరు డిఎస్పి బాలసుబ్రమణ్యం విలేకరులకు కేసు వివరాలను తెలిపారు. అక్రమ గంజాయి రవాణా ఘటనలో 19 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఒక నిందితుడిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి అక్రమ రవాణా కేసులో సాయికుమార్ ను అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ కేసు లో చరణ్, సతీష్, జగదీష్ ముగ్గురు ఉన్నారని ఇన్వెస్టిగేషన్ చేసే త్వరలో వారిని కూడా పట్టుకుంటామని తెలిపారు. నలుగురు ముద్దాయిలు చెన్నైకి చెందిన వారని తెలిపారు. వీరందరూ ఒరిస్సా నుండి గంజాయిని చెన్నైకు అక్రమంగా తరలిస్తుంటారని తెలిపారు. ఈ క్రమంలో మార్గమధ్యంలో ఉన్న వీరేపల్లి మోచర్ల మధ్యలో కల్వర్టు వద్ద కూలీలతో వెళ్తున్న ఆటోను అతివేగంగా ఢీకొట్టడంతో ఆటో కల్వర్టు పక్కన పడిపోవడంతో ఆ ప్రమాదంలో ఇద్దరు మరణించారు అని తెలిపారు. దీంతో నలుగురు ముద్దాయిలు కారులో ఉన్న గంజాయి బ్యాగులను తీసుకొని ముళ్ళపొదల్లో పెట్టి పారిపోయారని ప్రమాదం గుర్తించిన గుడ్లూరు ఎస్సై కేసు నమోదు చేయగా జిల్లా ఎస్పీ కందుకూరు డిఎస్పి ఉత్తర్వుల మేరకు గుడ్లూరు సిఐ ఆధ్వర్యంలో బృందాలుగా ఏర్పడి ముద్దాయిని గాలిస్తూ అందిన సమాచారం మేరకు ముద్దాయిలో ఒకరైన సాయికుమార్ ను మోచర్ల గ్రామ శివారులో అరెస్టు చేసినట్టు తెలిపారు. రూ. 1,90,000 విలువైన 19 కేజీల గంజాయిని సీట్ చేసినట్లు తెలిపారు. ఈ కేసులో మరికొందరిని అరెస్టు చేయాల్సి ఉందని వారికోసం పోలీసులు గాలిస్తున్నట్లు తెలిపారు. వీరిపై గంజాయి కేసు తోపాటు యాక్సిడెంట్ కేసు కూడా నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి తో పాటు గుడ్లూరు సీఐ నరేష్ కుమార్, ఎస్సై వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

